ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శనివారం, 20 జులై 2024

రుణమాఫీ... రైతులకు టోల్‌ఫ్రీ నెంబర్..

ఖమ్మం వ్యవసాయం, జూలై 19: రైతు రుణమాఫీకి సంబంధించి రైతుల సందేహాలకు, ఇబ్బందులను పరిష్కరించడానికి కలెక్టర్ ఆదేశాలమేరకు కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టోల్‌ఫ్రీ నెంబరు 1950, 90632 11298కు ఫోన్ చేసి రైతులు తమ ఇబ్బందులను వెల్లడించి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ఖమ్మం జిల్లాలో సుమారు 57,857 మంది రైతులకుగాను ఒకే విడతలో లక్షలోపు ఉన్న రైతులను మాఫీ చేయడం జరిగిందన్నారు. రూ.2లక్షలలోపు రైతు రుణమాఫీని ఆగస్టు 15లోపు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఎడతెగని వాన

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడోరోజూ కుండపోత

- భద్రాచలం వద్ద గోదావరి, కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్టులకు వరదనీరు
- పెదవాగు ప్రాజెక్టుకు 150 మీటర్ల పొడవున పెద్దగండి.. మొత్తం మూడుగండ్లు
- సింగరేణి ఓసీపీ గనుల్లోకి వర్షం నీరు.. బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



భద్రాచలం వద్ద గోదావరి పరవళ్లు

కొత్తగూడెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం కూడా జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేని వర్షం కురిసింది. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి సైతం పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు 5వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో పెరుగుతోంది. ప్రాజెక్టు నీటి మట్టం 402.30 అడుగులకు నీటి మట్టం చేరుకుంది. మూడు గేట్లు ఎత్తి 15వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కింద ఉన్న ముంపు గ్రామాల్లో రెవిన్యూ, పోలీసులు పర్యటిస్తూ వాగులు వంకలు దాట వద్ద ప్రజలను అప్రమత్తంచేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నది వరద నీటి మట్టం పెరుగుతోంది. ఉదయం 10గంటలకు 25. 8 అడుగులకు నీటి మట్టంచేరింది. మరింత పెరిగే అవకాశం ఉంది. చర్ల ప్రాంతంలోని తాలిపేరు ప్రాజెక్టుకు కూడ వరదనీరు వచ్చింది 24గేట్లు ఎత్తి 59వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకి కొంత వరద తగ్గుతుంది.

అశ్వారావుపేట మండలంలో పెద్దవాగు ప్రాజెక్టుకు గురువారం రాత్రే 3గండ్లు పడ్డాయి. వాటిలో 2 గండ్లు చిన్నవిగా పడ్డాయి. ఒకగండి మాత్రం 150మీటర్ల పొడవున పెద్దగండిపడింది. దీంతో ఆ ప్రాజెక్టులోని సుమారు 35 అడుగుల లోతులో ఉన్న నీరు మొత్తం బయటకు వెళ్లి పోయింది. దీంతోముంపు ప్రాంతాలైన గుమ్మడివెల్లి, కొత్తూరు గ్రామాల్లో వరద నీరు ముంచెత్తింది.

అయితే పెద్దవాగు ప్రాజెక్టుకు 150మీటర్ల గండి అడుగుపక్కనే పడటం వల్ల ఆ గ్రామాలకు ప్రమాదం తప్పినట్లైంది. ఆ నీరంతా బయటకు వెళ్లిపోవడంతో పక్కనే ఉన్న ఆంధ్రా ప్రాంతంలోని ఏలూరు జిల్లాకు చెందిన వేలేరుపాడు మండలంలోని సుమారు 10 గ్రామాలు ముంపుకు గురై వరదనీరు పట్టింది. గుబ్బలమంగమ్మ అటవీ ప్రాంతంలో సుమారు 30సెంటీమీటర్ల వరకు వర్షం కురవడం వల్ల వరద నీరు పెద్దవాగు ప్రాజెక్టులోకి ఆరు గంటల వ్యవధి లోనే 40వేల క్యూసెక్కుల నుంచి 80వేల క్యూసెక్కుల నీరు ఉధృతం రావడంతో ఆ ప్రాజెక్టు నీరంతా గండిపడి పలు గ్రామాల్లో బీభత్సం సృష్టించినట్లైంది. ఇదిలావుండగా, పెద్దవాగు ప్రాజెక్టు మూడుచోట్ల గండిపడటంతో తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఉన్న నిర్మాణానికి, మరమ్మతులకు జలవనరుల బోర్డు ద్వార పనులుచేపట్టాల్సి ఉంటుంది. సుమారు రూ.100కోట్ల వరకు ఖర్చుఅయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. తాత్కాలికమరమ్మతులకు సుమారు కోటి రూపాయలు ఖర్చు అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం ఏరియా, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో కురిసిన వర్షాల వల్ల గత మూడు రోజుల నుంచి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం జరిగింది. సుమారు లక్షటన్నుల వరకు బొగ్గు ఉత్పత్తికి అంతరాయం జరిగినట్లు సమాచారం.



కిన్నెరసాని ప్రాజెక్టు

గోదావరి పరవళ్లు

- 26.5 అడుగులు దాటిన ప్రవాహం
- ఈ సీజన్‌లో ఇదే తొలిసారి
- వరదలను ఎదుర్కొనేందుకు సెక్టోరియల్ అధికారుల నియామకం

భద్రాచలం, జూలై 19: ఈ ఏడాది వర్షాకాలం సీజన్‌లో తొలిసారిగా భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 25 అడుగులు దాటి ప్రవహిస్తోంది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు 18.2 అడుగులు ఉన్న నీటిమట్టం 9గంటల పాటు నిలకడగా ఉంది. అనంతరం క్రమేపి పెరుగుతూ శుక్రవారం ఉదయం 6గంటలకు 23.2 అడుగులకు చేరుకుంది. 9 గంటలకు 24.4, 12గంటలకు 25.6, మధ్యాహ్నం 3గంటలకు 26.1కు చేరుకుంది. కాగా సాయంత్రం 5 గంటలకు గోదావరి నీటి మట్టం 26.5 అడుగులకు చేరింది. గోదావరి ప్రవహంతో స్నానఘట్టాలు కింది భాగంలో నీటమునిగాయి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. కాగా గోదావరి నీటిమట్టం 30 అడుగుల వరకు చేరే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.



అశ్వారావుపేట మండలంలో కట్టకు గండి పడటంతో ఖాళీ అయిన పెదవాగు ప్రాజెక్టు

ఇళ్లలోకి అరడుగుల నీరు వచ్చిందని చూపుతున్న బాధితుడు

'పెదవాగు' బీభత్సం

ప్రాజెక్టుకు గండిపడటంతో దిగువ ప్రాంతాలను ముంచెత్తిన వరద

- అశ్వారావుపేట మండలంలో వందలాది ఎకరాల్లో పంట నష్టం
- పొలాల్లో ఇసుక మేటలు.. కొట్టుకుపోయిన రహదారులు...
- ధ్వంసమైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు..
- విద్యుత్‌శాఖకు రూ.80లక్షల నష్టం జరిగినట్టు అంచనా
- గుమ్మడివల్లి, కొత్తూరు గ్రామాల్లోకి చొచ్చుకు వచ్చిన వరదనీరు
- జలమయమై దెబ్బతిన్న ఇళ్లు.. కట్టుబట్టలతో రోడ్డెక్కిన బాధితులు
- రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపిన గ్రామస్థులు
- వేలేరుపాడు మండలంలో వందలాది పశువుల మృత్యువాత
- వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేల పర్యటన
- అన్నివిధాలా ఆదుకుంటామని బాధితులకు భరోసా
- పెదవాగు ప్రాజెక్టుకు గండిపై విచారణ జరిపిస్తామన్న కలెక్టర్

అశ్వారావుపేట/అశ్వారావుపేట రూరల్: జూలై 19: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక వైపు భారీ వర్షాలు, మరోవైపు పెదవాగు ప్రాజెక్టు కట్టకు గండి పడటంతో భారీగా పంట, ఆస్తి నష్టం వాటిల్లింది. అశ్వారావుపేట మండలంలోని గుమ్మడివల్లి, కొత్తూరు, నారాయణపురం, అనంతారం పరిసరాల్లో సుమారు 500 ఎకరాల్లో ఇసుక మేటలు వేయగా, నారు మళ్లు కొట్టుకుపోయాయి. వరి, పత్తి, మిర్చి, పామాయిల్ తోటలు దెబ్బతిన్నాయి. పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో వాటిని తొలగించాలంటే ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అనంతారం వద్ద లో లెవెల్ కాజ్‌వే కొట్టుకొని పోయింది. అలాగే అనంతారం, నారాయణపురం, గుమ్మడివల్లి వద్ద బీటీ రహదారులు ధ్వంసం అయ్యాయి. అనేకచోట్ల కోతకు గురయ్యాయి. వరదకు 70 విద్యుత్ స్తంభాలు, 15 ట్రాన్స్‌ఫార్మర్లు, 5 కిలోమీటర్ల మేర విద్యుత్ వైర్లు తెగిపడిపోయాయి. వీటిని పునరుద్ధరించే పనిలో విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.

కట్టుబట్టలతో బయటకు వచ్చాం...

పెదవాగు ప్రాజెక్టు కట్టకు గండి పడటంతో అశ్వారావుపేట మండలంలోని గుమ్మడివల్లి, కొత్తూరు గ్రామాలతో పాటు ఏపీలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర నష్టానికి గురయ్యారు. శుక్రవారం గుమ్మడివల్లి, కొత్తూరు గ్రామాలను సందర్శించినప్పుడు ఇళ్లలోకి నీరు చేరిన బాధితుల బాధలు వర్ణనాతీతంగా కనిపించాయి. కొత్తూరు గ్రామం చుట్టూ వరద నీరు చేరి గ్రామంలోని 15 ఇళ్లలోకి అరడుగులకు పైగా నీరు చేరింది. రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఒక్కసారిగా ఇళ్లలోకి నీరు చేరడంతో సామగ్రి ఏమి తీసుకోకుండానే ప్రాణాలను రక్షించుకునేందుకు రోడ్డుపైకి వచ్చినట్టు గ్రామస్తులు తెలిపారు. రోడ్డుపైకి కూడా భారీగా వరద నీరు చేరుకోవడంతో గ్రామంలో ఉన్న డాబాపైకి ఎక్కి రాత్రి ఒంటి గంట వరకు అక్కడే బిక్కుబిక్కుమంటూ గడిపామని గ్రామవాసి రాజేశ్వరి, మరి కొంత మంది మహిళలు విలేకరులకు తెలిపారు.

రాత్రి ఒంటి గంట తరువాత వరద తగ్గినప్పటికీ ఇళ్లలో అడుగులోతులో బురద చేరి, టీవీలు, ఫ్రిజ్‌లు, మంచాలు, దుస్తులు అన్నీ తడిసిపోయాయని, పడుకోవటానికి కూర్చోవటానికి కూడా వీలు లేకుండా తీవ్ర ఇబ్బందులు పడినట్టు తెలిపారు. తాగటానికి మంచి నీళ్లు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్మడివల్లి గ్రామంలో దేరంగుల ముసలయ్య, దుర్గమ్మ, వల్లెపు నాగమణి, బత్తుల కృష్ణ, అలివేలు, బత్తుల నాగేశ్వరరావు, వల్లెపు వెంకన్న, కొమరగిరి సత్యం, దేరంగుల చిట్టయ్య, వల్లెపు నాగమణి, పెద వెంకన్న, గేదెల లక్ష్మికాంతం, గోద సత్యనారాయణ, గోద వెంకటేశ్వరరావు, తాళ్ళూరి రాంబాబు... ఇలా 50మంది ఇళ్లలోకి వరదనీరు చేరింది. వీటిలో 15 ఇళ్లవరకు గోడలు కూలిపోయి నివాసం ఉండటానికి వీలు లేకుండా పోయాయి. ఆకస్మిక వరదతో ఇళ్లు కోల్పోయామని, కట్టుబట్టలతో బయటకు వెళ్లి పోయామని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. తమను ఆదుకోవాలని వేడుకున్నారు. ఇళ్లతోపాటు పొలాల్లో పంటలు నాశనమైపోయాయని, ఇసుక మేటలు వేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.

200కు పైగా పశువుల మృత్యువాత

పెదవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా పరిధిలోని పలు గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. ప్రాజెక్టు దిగువన ఉన్న అశ్వారావుపేట మండలంలోని గుమ్మడివల్లి, కొత్తూరు, బచ్చువారిగూడెం, నారాయణపురం గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, పలుగ్రామాల్లో ప్రజలు నిరాశ్రయులయ్యారు. అలాగే ఏలూరు జిల్లా పరిధిలోని వేలేరుపాడు

(మిగతా 6వ పేజీలో)



చెరువులకు జలకళ

- ఉమ్మడి ఖమ్మం జిల్లాను వదలని వర్షం
- చెరువులు, ప్రాజెక్టులకు చేరుతున్న వరదనీరు
- నిండుకుండలా బేతుపల్లి, లంకాసాగర్ 7
- పోలీసుశాఖ అప్రమత్తం.. కంట్రోల్‌రూం ఏర్పాటు

పెదవాగు గండి ఓ గుణపాఠం

- సరిహద్దుల్లో సమన్వయం లేకపోతే సమస్యలే...
- వరదల వేళ ముందుచూపు అవసరం
- ఇరు రాష్ట్రాల సంయుక్త కార్యాచరణతోనే ప్రాణ, ఆస్తినష్టం నివారణ సాధ్యం 6





అశ్వారావుపేట మండలం కొత్తూరులో ఇంటిలో పేరుకున్న బురదను శుభ్రం చేస్తున్న దృశ్యం



పెదవాగు వరద ఉధృతికి విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



పెదవాగు వరదతో గుమ్మడివల్లిలో కొట్టుకుపోయిన వరి పొలం.. దిగాలుగా రైతు..

రైతు రుణమాఫీ సంబరాలు

ఖమ్మం మార్కెట్‌లో సీఎం, మంత్రి తుమ్మల చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఖమ్మం మార్కెట్, జూలై 19: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం రైతు రుణమాఫీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతులు, వ్యాపారులు, రైతు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బాణాసంచా, టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద మొత్తంలో రుణ మాఫీ చేసిన ఘనత తెలంగాణా కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, నగర అధ్యక్షుడు జావెద్, రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, గుత్తా వెంకటేశ్వరరావు, కార్పోరేటర్లు కమర్తపు మొరళి, మలీదు జగన్, కొప్పెర ఉపేందర్, చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రెజరర్ తల్లాడ రమేష్, దిగుమతి శాఖ అధ్యక్షుడు దిరిశాల వెంకటేశ్వర్లు, బాణాల లక్ష్మణ్, కార్మిక సంఘం నాయకుడు నున్నా మాధవరావు, మేళ్ళచెరువు వెంకటేశ్వరరావు, హమాలీలు తదితరులు ఉన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ 2వ మోటార్ ట్రయల్‌రన్

అశ్వాపురం, జూలై 19 : సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు సంబంధించి మొదటి దశలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని బిజి కొత్తూరు వద్ద నిర్మించిన పంప్‌హౌస్ లో 2వ మోటార్ ట్రయల్‌రన్‌ను శుక్రవారం నిర్వహించారు. సీతారామ ప్రాజెక్ట్ నుంచి పాలేరుకు గోదావరి జలాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పంలో భాగంగా గతనెల 27న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో అధికారులు మొదటి మోటార్ ద్వారా ట్రయల్‌రన్‌ను విజయవంతంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ములకలపల్లి మండలంలో నిర్మించిన రెండు,మూడు దశల పంప్‌హౌస్‌లలో ఈనెల 22 తర్వాత ట్రయల్‌రన్ నిర్వహించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. దానిలో భాగంగానే బిజి కొత్తూరు పంప్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన ఆరు మోటార్లను రన్‌చేసే ప్రక్రియలో భాగంగా 2వ మోటార్‌ను అధికారులు రన్‌చేశారు.



సీతారామ ప్రాజెక్ట్ మొదటి దశ 2వ మోటార్‌ను రన్‌చేసిన దృశ్యం

జేఎన్‌టీయూకు పెరిగిన ఆదరణ

మొదటి విడత కౌన్సెలింగ్‌లో 275 సీట్ల భర్తీ

ఖమ్మం ఖానాపురం హవేలీ, జూలై 19: ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలోని జేఎన్‌టీయూ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలకు ఈ ఏడాది ఆదరణ పెరిగింది. గతేడాది ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో చివరి దశలో కళాశాల ఏర్పాటు కావటంతో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. 2024-25 విద్యా సంవత్సరంలో ఎప్‌సెట్ మొదటి విడతలో జేఎన్‌టీయూ కళాశాలకే విద్యార్థులు మొదటి ప్రాధాన్యత ఇచ్చి 275 సీట్లను ఎంచుకున్నారు.

కళాశాలలో మొత్తం 330 సీట్లు 2024-25 విద్యా సంవత్సరానికి అందుబాటులో ఉండగా మొదటి కౌన్సెలింగ్‌లోనే 275 సీట్లను విద్యార్థులు ఎంపిక చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. మిగిలిన 55 సీట్లు రెండో విడత కౌన్సెలింగ్‌లో భర్తీ కానున్నట్టు తెలిపారు. మొదటి విడతలో సీఎస్సీలో 65, డేటా సైన్స్‌లో 65, ఈఈఈలో 59, ఈసీఈలో 60, మెకానికల్‌లో 26 సీట్లు భర్తీ అయినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సీఎస్సీ, డేటా సైన్స్‌లో సీట్లు పూర్తికాగా, ఈఈఈ, ఈసీఈ, మెకానికల్ బ్రాంచిల్లో సీట్లు ఖాళీలు ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీ

ఉద్యోగుల బదిలీలు

ఖమ్మం రెగ్యూలర్ మార్కెట్‌కు బదిలీలలో మళ్లీ మొండిచెయ్యి

ఖమ్మం మార్కెట్, జూలై 19: ఉమ్మడి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీలలో పనిచేసే ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఈమేరకు గురు, శుక్రవారాల్లో వారికి కౌన్సెలింగ్ సైతం పూర్తయిందని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా నిబంధనల ప్రకారం ఒకే మార్కెట్‌లో ఏడేళ్లకు పైగా పనిచేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. బదిలీల్లో భాగంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. వారిలో సూపర్‌వైజర్ బి.విజయకుమారి వైరా మార్కెట్‌కు, బిడ్ క్లర్క్ సీహెచ్.బాలాజీ మధిర మార్కెట్‌కు, జేఎమ్ఎస్ సీహెచ్. సామ్రాజ్యం వైరా మార్కెట్‌కు, అటెండర్ భాగ్యమ్మ మద్దులపల్లి మార్కెట్‌కు బదిలీ అయ్యారు. వైరా మార్కెట్ కమిటీలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు స్థానచలనం కలిగింది. వారిలో సూపర్‌వైజర్ ఆర్.ప్రసాద్, ఎల్‌డీసీ గీతాబాయి ఖమ్మం మార్కెట్‌కు బదిలీ కాగా జేఎమ్ఎస్ దావీద్ కల్లూరు మార్కెట్‌కు బదిలీ అయ్యారు. మధిర వ్యవసాయ మార్కెట్‌లో ఇద్దరు ఉద్యోగులకు స్థానచలనం కలిగింది. ఇక్కడి వాచ్‌మెన్ సెల్వరాజుతోపాటు అటెండర్ చంద్రకళ ఖమ్మం మార్కెట్‌కు బదిలీ అయ్యారు. అంతేకాకుండా భద్రాద్రి జిల్లా కొత్తగూడెం మార్కెట్లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావు ఇల్లెందు మార్కెట్‌కు, ఇల్లెందు మార్కెట్‌లోని సూపర్‌వైజర్ ఎస్.వెంకటేశ్వర్లు, జేఎంఎస్ నర్సింహరావు, అటెండర్ అంకె రమేష్ కొత్తగూడెం మార్కెట్‌కు బదిలీ కాగా, భద్రాచలం మార్కెట్‌లో వాచ్‌మెన్ బి.జ్యోతి సైతం కొత్తగూడెం మార్కెట్‌కు బదిలీ అయింది. కాగా బదిలీల ఉత్తర్వులను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నేడో రేపో అధికారికంగా విడుదల చేయనున్నట్టు తెలిసింది.

ఖమ్మం మార్కెట్‌కు మొండి చెయ్యి

ఉమ్మడి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఉద్యోగుల బదిలీలలో భాగంగా రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయిన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మరోసారి మొండి చెయ్యి ఎదురైందని మార్కెటింగ్ శాఖ ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు. మార్కెట్‌లో మొత్తం 49మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 17 మందితోనే సరిపెట్టుకుంటుండగా ప్రస్తుత బదిలీల్లో యార్డుల్లో కమాండింగ్ చేసే ఉద్యోగులు ఎక్కువమంది ఇతర మార్కెట్‌లకు బదిలీకాగా కేవలం ఆఫీసు కార్యాలయంలో కిందిస్థాయిలో పనిచేసే వాచ్‌మెన్, అటెండర్ తదితర ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగులను మాత్రమే ఖమ్మం మార్కెట్‌కు అత్యధికంగా కేటాయించారు. దీంతో ఇప్పటికే సిబ్బంది లేమితో బాధపడుతున్న మార్కెట్‌కు యార్డులలో కమాండింగ్ చేసే సూపర్‌వైజర్ ఆపైస్థాయి పోస్టులు మంజూరు కాక పోవడంతో కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా జనరల్ ఆస్పత్రి ఆర్ఎంవోగా కళావతిబాయి



ఖమ్మం కలెక్టరేట్, జూలై 19: జిల్లా జనరల్ ఆస్పత్రి ఆర్ఎంవోగా కళావతి భాయి నియితులయ్యారు. ఇప్పటి వరకు ఖమ్మం మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రికి ఇన్‌చార్జ్‌లే ఆర్ఎంవోగా వ్యవహరించారు. ప్రస్తుతం సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో ఆర్ఎంవోగా పనిచేస్తున్న కళావతి భాయిని బదిలీపై ఖమ్మంకు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఆమె శనివారం బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది. ఖమ్మం జనరల్ ఆస్పత్రికి ఇప్పటి వరకు ఇన్‌చార్జిలుగా వ్యవహరించగా ప్రస్తుతం రెగ్యులర్ ఆర్ఎంవోని నియమించారు.



ఖమ్మం గాంధీచౌక్‌లోని వరప్రదాత శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో రూ.3.50 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో సాయిబాబాను అలంకరించారు.

సహకార బ్యాంకుల ద్వారా రైతులకు సాయం

- డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు
- క్యాపిటల్ తగ్గించాలని రైతుల వినతి



డీసీసీబీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దమ్మపేట, జూలై 19: సహకార బ్యాంకుల ద్వారా రైతులకు ఆర్థిక సహకారం అందించేందుకు పెద్దఎత్తున రుణాలు అందిస్తున్నట్టు తెలిపారు. దమ్మపేట సహకార బ్యాంకు చైర్మన్ వెంకటేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు బ్యాంకులకు పోటీగా సహకార బ్యాంకుల ద్వారా రైతులకు అన్ని సౌకర్యాలు కల్పింస్తుందన్నారు. పామాయిల్ రైతులకు అధికంగా రుణసదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం రైతులు మాట్లాడుతూ త్వరితగతిన రుణసౌకర్యం అందించాలని, షేర్ క్యాపిటల్ విధానం రద్దు చేయాలని, వడ్డీరేటు తగ్గించటం, రుణాలు పహాణీలు ద్వారా కాకుండా డిజిటల్ పాస్‌బుక్‌లపై ఇవ్వాలని, డాక్యుమెంటేషన్ పేరుతో రుణాల మంజూరులో కాలయాపన లేకుండా సత్వరమే రుణాలు మంజూరు చేయాలని, రుణాల దరఖాస్తు చేసే విధానం సరళతరం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. చైర్మన్‌ను రైతులు, బ్యాంకు సిబ్బంది సత్కరించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో దమ్మపేట సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, రావు గంగాధరరావు, దొడ్డా ప్రసాద్, ఎర్రా వసంతరావు, ఎర్రగొర్ల రాధాకృష్ణ, బ్యాంకు మేనేజర్ నాగభూషణం, సొసైటీ సీఈవో ఆకుల నాగేశ్వరరావు, బ్యాంకు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో 155 పోస్టుల

మెరిట్ లిస్ట్ విడుదల

- అభ్యంతరాలు వచ్చేనెల 5 లోపు లిఖిత పూర్వకంగా అందజేయండి
- భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పన అధికారి వేల్పుల విజేత



చుంచుపల్లి, జూలై 19: కొత్తగూడెం మెడికల్ కళాశాలలో 155 అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితా భద్రాద్రి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచామని జిల్లా ఉపాధి కల్పన అధికారి వేల్పుల విజేత తెలిపారు. శుక్రవారం ఐడీవోసీలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ గతంలో 23 కేటగిరీలలో 155పోస్టుల అవుట్‌సోర్సింగ్ భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా.. సుమారు 5వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా సిద్ధం చేసిన జాబితాను విడుదల చేస్తూ ఈ జాబితాపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా లిఖిత పూర్వకంగా అందజేయాలన్నారు. వచ్చే నెల 5వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని తగిన ఆధారాలతో అందజేయాలన్నారు. స్వీకరించిన అభ్యంతరాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి చివరి మెరిట్ జాబితాను ప్రకటిస్తామని, ఇది చివరి అవకాశంగా అభ్యర్థులు భావించాలన్నారు.

పెదవాగు బీభత్సం

(5వ పేజీ తరువాయి)

మండలంలో ఏడు గ్రామాలు కూడా ప్రభావితమయ్యాయి. కమ్మరిగూడెం, ఒంటిబండ, కోయమాధారం, అల్లూరి నగర్, రామవరం, ఇప్పలగుంపు, ఊటగుంపు గ్రామాలను వరదనీళ్లు ముంచెత్తాయి. పంటలతో పాటు ఇళ్లు దెబ్బతిన్నాయి. గ్రామాల్లోకి వరద నీరు చొచ్చుకురావడంతో 200కుపైగా పశువులు మృత్యువాత పడ్డాయి. పశుసంపదను కోల్పోయిన రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

నష్టపోయిన వారిని ఆదుకుంటాం...

పెదవాగు ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీగా వర్షాలు కురవడం వల్ల ప్రాజెక్టు కట్టకు గండి పడి ప్రజల పంటలు, ఆస్తులకు నష్టం వాటిల్లిందని, అంచనాలు వేసి బాధితులకు త్వరలోనే సహాయం అందచేయడానికి ఏర్పాట్లు చేస్తామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. శుక్రవారం ఆయన ఎస్పీ రోహిత్‌రాజు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి పెదవాగు ప్రాజెక్టు గండిని, ఇసుక మేటలు వేసిన పంటలు, నీటిలో కొట్టుకొని పోయిన పంటలు, గుమ్మడివల్లి, కొత్తూరులో నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా నష్టపోయిన రైతులతో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా గురువారం 25 మంది వాగుల మధ్య చిక్కుకుపోగా ఏపీ అధికారుల సహకారంతో ప్రాణ నష్టం లేకుండా రక్షించగలిగామన్నారు. ప్రాజెక్టుకు గండి పడటంలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం ఉంటే పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ సీఈని ఆదేశించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పంట నష్టాన్ని, ఇళ్లు కోల్పోయిన వారిని అధికారులు సర్వే చేసి గుర్తించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి నష్టాలను అంచనా వేయాలని, ప్రాజెక్టును ఏ విధంగా వినియోగంలోకి తీసుకురావాలో చర్చిస్తున్నారన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

బాధితులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే జారే

పెదవాగు ప్రాజెక్టు కట్టకు గండితో ముంపునకు గురైన గుమ్మడివల్లి, కొత్తూరు గ్రామాలను ఎమ్మెల్యే ఆదినారాయణ అధికారులతో కలిసి పర్యటించారు. నీట మునిగిన ఇళ్లకు వెళ్లి బాధితులతో మాట్లాడారు. బాధితులను ఆదుకుంటామని, ఇళ్లు కోల్పోయిన వారికి పక్కా గృహాలు మంజూరు చేయిస్తామని, పంటలు సర్వే చేసి పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. తక్షణమే విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని, బాధితులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.



ఇసుక మేటలు వేసి నాశనమైన పామాయిల్ తోట



గుమ్మడివల్లిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఎమ్మెల్యే ఆదినారాయణ

నారాయణపురం-గాండ్లగూడెం మధ్యలో కొట్టుకొనిపోయిన లో లెవెల్ కాజ్‌వే





గుమ్మడిపల్లిలో నేలకొరిగిన వరిపంట



గుమ్మడివల్లిలో బురదమట్టిని తొలగిస్తున్న దృశ్యం

వరద.. విలయం

- వేలేరుపాడును ముంచేసిన పెద్ద వాగు
- మొరాయించిన మూడో గేటు.. భారీ గండి
- గుట్టలెక్కి ప్రాణాలు కాపాడుకున్న జనం
- సర్వం కోల్పోయిన కమ్మరిగూడెం



వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఏలూరు ఎస్పీ

ఏలూరు/వేలేరుపాడు/కుక్కునూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడిపల్లి సమీపంలోని పెద్ద వాగుకు సంభవించిన భారీ వరదతో వేలేరుపాడు అతలాకుతలమైంది. గురువారం ఎగువ భాగం నుంచి భారీగా వరదనీరు ప్రాజెక్టులోకి చేరడం ఒక ఎత్తైతే, ఈ ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేసేందుకు మూడు గేట్లలో ఒకటి పైకి లేవకుండా మొరాయించడం.. ఈ కారణంగానే వరద నీరు కిందికి చేరడంలో ఆటంకం ఏర్పడి గండికి దారితీసింది. గురువారం మధ్యాహ్నం నుంచి వరద నీరు ప్రాజెక్టు కట్టల మీదుగా దిగువకు పారడం ఆరంభమైంది. ప్రాజెక్టుకు ఎడమ భాగాన, క్రస్ట్ గేటుకు పక్కన వరద ఉధృతికి గట్టు తట్టుకోలేక క్రమేపీ గండికి దారితీసింది. దీంతో వరద నీరంతా దిగువకు దూసుకుపోవడంతో 15 గ్రామాలకుపైనే నష్టాన్ని చవిచూశాయి. ఒంటిబండ, ఊటగుంపు, మేడేపల్లి గ్రామాల్లోని ఇళ్ళలోకి వరదనీరు దూసుకొచ్చింది. దీంతో పూరి గుడిసెలు నేలమట్టమయ్యా యి. ప్రజలు ప్రాణాలు అరచేత పట్టుకుని గుట్టపైకి పారిపోయి, తలదాచుకున్నారు. రాత్రంతా చిమ్మ చీకటిలోనే గడిపారు. అల్లూరినగర్, రెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వరకు దాదాపు ఐదు కిలోమీటర్ల మేర రహదారి ధ్వంసమైంది. రెడ్డిగూడెం - వసంతవాడ మధ్య మరో కిలోమీటరు మేర మార్గంలో ఇదే పరిస్థితి. ఇక్కడ ఐదిళ్ళు ధ్వంసమయ్యాయి. పెద్దవాగు కారణంగా సుమారు 15 గ్రామాల్లో 70 శాతంపైగా ఇళ్ళు పాక్షికంగాకానీ, పూర్తిగా కాని దెబ్బతిన్నాయి. వేలేరుపాడు మండలమే తరచూ ముంపు లేదా వరద బారిన పడుతూనే ఉంది. ఈ మండలంలో సాధారణ పరిస్థితులు తిరిగి నెలకొనేందుకు చాలాకాలం పట్టే అవకాశం ఎక్కువగా ఉంది.

పశువులు మృత్యువాత

భారీ వరదకు ఆయా గ్రామాల్లోని వందలాది పశువులు మృత్యువాత పడ్డాయి. మరెన్నో కొట్టుకుపోయాయి. గ్రామాల్లోని ఇళ్ళ వద్ద కట్టేసిన పశువులు తప్పించుకునే వీలులేక ఎక్కడికక్కడ మృతి చెందాయి.

ధ్వంసంమైన రోడ్లు

పెద్ద వాగు మహోగ్ర రూపానికి వేలేరుపాడు మండల వ్యాప్తంగా ప్రధాన రహదారులతోపాటు గ్రామాల్లోని అంతర్గత రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. రహదారులు వంతెనలు, దెబ్బ తినడంతో వేలేరుపాడుకు చుట్టుపక్కల గ్రామాలతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. వేలేరుపాడు, అశ్వారావుపేట ఆర్అండ్‌బీ రహదారిపై 5కిలోమీటర్ల మేర భారీగా గండ్లు పడటంతో వాహనాలు తిరిగే పరిస్థితి లేకపోయింది. గండ్లుపడ్డ రహదారులను ఎంత త్వరగా బాగు చేయాలన్న కనీసం వారం రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులే అంటున్నారు.

కమ్మరిగూడెం విలవిల

పెద్దవాగు ప్రాజెక్టుకు కూత వేటు దూరంలోని కమ్మరిగూడెం గ్రామంపైకి మృత్యువులా వరద వచ్చి పడటంతో గ్రామానికి చెందిన ప్రజలు సమీపంలోని గుట్టలపైకి చేరుకుని ప్రాణాలు దక్కించుకున్నారు. వరద ఒక్కసారిగా వచ్చిపడటంతో కట్టుబట్టలతోనే పరుగులు తీయడంతో ఇళ్లలోని సామగ్రి మొత్తం వరదలో కొట్టుకుపోవడంతోపాటు గ్రామంలోని పశువులు, కోళ్ళు, పెంపుడు జంతువులు మొత్తం వరదలో కొట్టుకుపోయాయి. తీవ్రమైన వరద దాటికి గ్రామంలోని పక్కా ఇళ్ళు తప్ప పూరిళ్ళు మొత్తం కుప్పకూలిపోయాయి.

కలెక్టర్, ఎస్పీ పర్యటన

జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వీ పెద్దవాగు ప్రాజెక్టు వరదల్లో భారీగా దెబ్బ తిన్న గ్రామాల్లో శుక్రవారం ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జేసీ లావణ్యవేణితో కలిసి రోజంతా పర్యటించారు. వరద ఉధృతికి రోడ్లన్నీ కొట్టుకుపోవడంతో వాహనాలు వెళ్ళే పరిస్థితి లేకపోయినా కొంతలో కొంత సాహసించి అల్లూరినగర్‌తోపాటు మరికొన్ని గ్రామాల్లోనూ పర్యటించారు. బాధితులను కలిసి భయం లేదు.. మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. ఇంకా వర్షాలు పడే అవకాశం ఉన్నందున తక్షణం సహాయ కేంద్రాలకు రావాల్సిందిగా గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

కొట్టుకుపోయిన రహదారులు

పెద్ద వాగు కాల్వ ఉధృతికి కుక్కునూరు-లచ్చిగూడెం ప్రధాన రహదారి కొట్టుకుపోవడంతో భారీ గండి పడింది. రెండుచోట్ల ఈ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. కుక్కునూరు-భద్రాచలం, కుక్కునూరు-అశ్వారావుపేట ప్రధాన రహదారంతా గోతులమయం కావడంతో వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో ప్రజలు ఈ రహదారిపై ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.





వేలేరుపాడులో బాధితులతో మాట్లాడుతున్న ఏలూరు కలెక్టర్, వరదకు కొట్టుకుపోయిన రహదారులు

‘పెదవాగు’ గండి ఓ గుణపాఠం

- వర్షాలు, వరదల తరుణంలో ముందుచూపు అవసరం
- సంయుక్త కార్యాచరణతో ప్రాణ, ఆస్తినష్టం నివారణ సాధ్యం

ఖమ్మం, జూలై 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గోదావరి, కృష్ణా వరదలు, అక్కడక్కడ ఉండే వాగులు, చెరువులు, భారీ వర్షాలతో ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రమాదాలు జరిగిన సందర్భంలో సరిహద్దు రాష్ట్రాల మధ్య సమన్వయం లేకపోతే ప్రాణాపాయాలు, ఆస్తి నష్టాలు అధికంగా జరిగే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సరిహద్దు జిల్లాల అధికారయంత్రాంగం మధ్య వర్షాలు, వరదల తరుణంలో భారీ ప్రమాదాలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో ముందుచూపుతో సమన్వయంగా వ్యవహరిస్తే ప్రాణ ఆస్తినష్టాలను కూడా సకాలంలో నివారించే అవకాశం కలుగుతుంది.



పెదవాగుకు పడిన గండి

తెలంగాణ ఆంధ్రా సరిహద్దులోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పెదవాగు సంఘటనే రాష్ట్రాల సరిహద్దుల్లో జరిగే విపత్తుల పరిస్థితికి ఉదాహరణగా, గుణపాఠంగా నిలవబోతుంది. ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన పెదవాగు ప్రాజెక్టు సుమారు 18360 ఎకరాలకు సాగు నీరందిస్తుంది. అయితే ఇందులో రాష్ట్ర విభజనలో ఆయకట్టు ప్రాంతం ఆంధ్రాలో, ప్రాజెక్టు తెలంగాణలో ఉండడంతో ప్రాజెక్టు మరమ్మతులకు పెద్ద సమస్య తలెత్తింది. గడిచిన పదేళ్లగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టిసారించలేదు. అటు కేసీఆర్ ప్రభుత్వంకానీ, ఇటు జగన్ ప్రభుత్వం కాని ఈప్రాజెక్టు మరమ్మతులకు నిధులు కేటాయించలేదు. 2360 ఎకరాలు తెలంగాణలో , ఆంధ్రాలో 16వేల ఎకరాలకు నీరందిస్తున్నందున ఈప్రాజెక్టు మరమ్మతుల భారం ఆంధ్రానే భరించాలనే డిమాండ్ ఉంది.

రాష్ట్ర విభజన తర్వాత ఈప్రాజెక్టు విషయంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో మరమ్మతులకు పైసా కూడా ఇవ్వని పరిస్థితి. గేట్ల పటిష్టత దెబ్బతినడం, గేట్లు సక్రమంగా పనిచేయకపోవడం, వరద ఉధృతికి గండి పడడం వెంటవెంటనే జరిగాయి. 30వేల క్యూసెక్కుల నీటి నిలవ సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టుకు ఒక్కసారిగా 80వేల క్యూసెక్కుల వరకు వరద వచ్చిపడింది. దీంతో భారీగా గండి పడి సుమారు రూ.20కోట్ల వరకు నష్టం వాటిల్లింది. దీనికి 2.81లక్షల చదరపు కి.మీ. వైశాల్యం క్యాచ్‌మెంట్ ఏరియా ఉంది. ఇది పూర్తిగా ఆంధ్రాలోని ఏలూరు జిల్లాలో ఉండడం గమనార్హం. 1989లోకూడా 70వేల క్యూసెక్కుల వరకు వరదనీరు రావడంతో ప్రాజెక్టుకు గండి పడింది. ఆ తర్వాత గేట్లు అమర్చారు. అయినా రాష్ట్ర విభజన శాపం ఈ ప్రాజెక్టుపై పడడంతో రెండు రాష్ట్రాల పర్యవేక్షణ లేకపోవడంతో చివరకువరద ధాటికి భారీ గండి పడింది. తీవ్ర నష్టం వాటిల్లింది. 150 మీ. పొడవున గండి పడడంతో ఈ గండిని పూడ్చాలంటే కేంద్ర జలంసంఘం అధికారులు రెండు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు పరిశీలించి మరమ్మతులకు ఆయకట్టు ఆధారంగా నిధులు కేటాయింపు జరపాల్సి ఉంటుంది.

ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాలో అకాలంగా పడిన వర్షాన్ని అంచనా వేయకపోవడం, వరదనీరు ముంచెత్తడం, 28మంది జలదిగ్బంధానికి గురికావడం, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సమాచారం అందిన వెంటనే ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను అప్రమత్తం చేసి రెండు హెలీకాప్టర్లు పంపడం ద్వారా వారిని రక్షించగలిగారు. అలాగే తెలంగాణ రాష్ట్ర రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా ఏపీ ప్రభుత్వ ప్రభుత్వ సీఎస్‌తో మాట్లాడి తక్షణ సహాయ చర్యలు చేపట్టాలనిసూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ, ఏపీ నుంచి సకాలంలో స్పందన రావడంతో రెండు హెలికాప్టర్లు వచ్చి చీకట్లోనే 28మంది వరదలో చిక్కుకున్న వారిని ప్రాణాలతో కాపాడగలిగారు. రాష్ట్రాల మధ్య అధికారులు మధ్య సమన్వయం లోపిస్తే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉండేది. దీనికి తోడు ఇటు తెలంగాణ అటు ఆంధ్రా జిల్లాల సరిహద్దు అధికారులు కూడా ముంపు గ్రామాలను అప్రమత్తం చేశారు. పెదవాగు ప్రాజెక్టు తెగినందున అప్రమత్తం చేయడంతో రాత్రికి రాత్రి అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి, కొత్తూర గ్రామాల నుంచి 70 కుటుంబాలను ఎగువ ప్రాంతానికి తరలించారు. 15 ఇళ్లుపూర్తిగా దెబ్బతిన్నాయి.

ఆంధ్రాలో కలిసిన వేలేరుపాడు ముంపు మండలంలో రాత్రికి రాత్రి వరద వచ్చి పడడంతో మేడేపల్లి, కమ్మరిగూడెం, ఒంటిబండ, రాటగుంపు, అల్లూరినగర్, రాళ్లపుడి గ్రామాల్లో రాత్రికి రాత్రి వరద రావడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎగువన గుట్టలవైపు పరుగులు తీశారు. మొత్తం పది గ్రామాలు జలదిగ్బంధం అయ్యాయి. ఏలూరు కలెక్టర్ ఎస్పీతో పాటు ఇరిగేషన్ అధికారులు వచ్చి సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఉన్నతాధికారులందరు సమన్వయంతో సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రెండు రాష్ట్రాలు సమన్వయంగా వ్యవహరించడంతో పెదవాగు ప్రాజెక్టు వరదముంపులో ప్రాణనష్టం జరగలేదు. అయితే వందల సంఖ్యలో పశువులు, మేకలు కొట్టుకుపోయినట్టు సమాచారం.

అకాలవర్షాలు, గోదావరి, కృష్ణా నదులు పొంగి ప్రవహించినప్పుడు సరిహద్దు వాగులు వంకలు పొంగినప్పుడు ప్రకృతి వైపరీత్యాల తరుణంలో సమన్వయంగా వ్యవహరిస్తేనే ప్రాణ,ఆస్తినష్టాలను రక్షించే అవకాశం ఉంది. గోదావరి, కృష్ణానదులపై వానలు, వరదల సమచారం కేంద్ర జలసంఘంకు సమాచారం బట్టి సహాయ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది. అయితే అకాలవర్షాలు అక్కడక్కడ పడినప్పుడు వాగులు, వంకలు పొంగినప్పుడు అనుకోని ప్రమాదాలు వచ్చి పడుతున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో, సరిహద్దులో జరిగే భారీ రోడ్డు ప్రమాదాలు లేదా పిడుగుపాట్లు , భూకంపాలు వంటి సందర్భాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారయంత్రాంగం ప్రభుత్వాలు ముందుచూపుతోనే ప్రణాళిక సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో అనుసరించాల్సిన వ్యూహంపై సమన్వయ సమావేశాలు ప్రతిఏటా వేసవిలోనే నిర్వహించుకుంటే అనుకోని ఆపదలు వచ్చినప్పుడు సమర్థవంతంగా సహాయ కార్యక్రమాల నిర్వాహణ, ప్రాణ, ఆస్తినష్టాలను నివారించే అవకాశాలు కలుగుతాయి. ఆంధ్రా, తెలంగాణ సరిహద్దులోని పెదవాగు సంఘటన దృష్టిలో ఉంచుకుని సరిహద్దు రాష్ట్రాల మధ్య ప్రకృతి వైపరిత్యాల నివారణకు సంయుక్త కార్యాచరణ ఎంతైనా అవసరంఉంది.

ప్రతిభావంతులకు ఎన్నారై రూ.లక్ష వితరణ

వైరా, జూలై 19: వైరా మునిసిపాలిటీ పరిధిలోని సోమవరానికి చెందిన ప్రముఖ ప్రవాస భారతీయుడు కొండబోలు సురేష్ పదోతరగతిలో ప్రతిభ చూపిన పదిమంది విద్యార్థులకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. ప్రతిభ చూపిన ఒక్కో విద్యార్థికి రూ.పదివేల చొప్పున పది మంది విద్యార్థులకు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చేతులమీదుగా శుక్రవారం వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రూ.లక్షను పంపిణీ చేశారు. కొన్ని దశాబ్దాల కిందట స్వదేశాన్ని వీడినప్పటికీ ఇక్కడి విద్యాభివృద్ధికి కొండబోలు సురేష్ అందిస్తున్న ప్రోత్సాహన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఇంటర్, ఇంజనీరింగ్ చదువుతున్న పేద విద్యార్థులకు సురేష్ సోదరి లలిత ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించటం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతారాములు, జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జీవీ.సూర్యప్రకాశరావు, దొడ్డా వరప్రసాద్, వెలిశెట్టి నర్సింహారావు, పెనుగొండ ఉపేందర్, ఆమడాల సుధాకర్ పాల్గొన్నారు.



విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

డీఎస్సీ పరీక్షకు 1619 మంది హాజరు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 19: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన డీఎస్సీ ఎస్‌జీటీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాలలో మొత్తం 952 మందికి 863 మంది హాజరుకాగా, 89 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఐదు పరీక్షా కేంద్రాలలో మొత్తం 793 మందికి 756 మంది హాజరుకాగా 37 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాలేదని తెలిపారు. మొత్తం 1745 మందికి 1619 మంది పరీక్షకు హాజరై, 126 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాలేదు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు పరిక్ష సమయానికి ముందుగానే చేరుకోని పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మాత్రం ఎటువంటి ముందస్తు ఏర్పాట్లు చేయకపోవటంతో అభ్యర్థులకు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు.

భద్రాద్రి జిల్లాలో 213 మంది హాజరు..

కొత్తగూడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలో డీఎస్సీ పరీక్షలు రెండో రోజు శుక్రవారం సుజాతనగర్ మండలంలోని అబ్దుల్‌కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం సమయంలో జరిగిన పరీక్షలో మొత్తం 130మంది అభ్యర్థులకు గాను 113మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30గంటల సమయంలో జరిగిన రెండో షిఫ్టులో 109మంది అభ్యర్థులకు 100మంది అభ్యర్థులు హాజరయ్యారు.

సింగరేణిలో ఉద్యోగ నియామకాలకు

నేటినుంచి రాత పరీక్షలు

- 272 ఎక్స్‌టర్నల్‌పోస్టులకు భర్తీ

కొత్తగూడెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఎక్స్‌టర్నల్ పోస్టుల భర్తీ కోసం సింగరేణియాజమాన్యం చర్యలు చేపట్టింది. సింగరేణిలోని 10 కీలక విభాగాల్లో 272 పోస్టుల భర్తీ కోసం 18,665మంది అభ్యర్థులకు హాలు టికెట్లను పంపిణీ చేశారు. సింగరేణి చరిత్రలో పూర్తి కంప్యూటర్ ద్వార పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసింది. సింగరేణి యాజమాన్యం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఈడీసీఐఎల్ సంస్థతో ద్వారా ఈనెల 20, 21 తేదీల్లో హైదరాబాద్ జంటనగరాల్లోని 12 పరీక్ష కేంద్రాల ద్వార ఈపరీక్షలు నిర్వహించనున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్. బలరాం తెలిపారు. అభ్యర్థులు అర్ధగంట ముందే పరీక్ష కేంద్రానికిచేరుకోవాలని కోరారు. ఎక్స్‌టర్నల్ పోస్టుల భర్తీకి పూర్తి కంప్యూటకీరణ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నామని అభ్యర్థులు ఎవరు దళారులనునమ్మిమోస పోవద్దన్నారు. అభ్యర్థులందరికి పరీక్షలకు ముందు పరీక్షల తర్వాత బయోమెట్రిక్ వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురైతే 08744 249992 హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని కోరారు.

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు

ఆదివాసీ యువకుడి ఎంపిక

- రూ.లక్ష ఆర్థిక సాయం అందించిన ఐటీడీఏ పీవో రాహుల్

వాజేడు, జూలై 19: అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఆదివాసీ యువకుడు ఎంపికయ్యాడు. మండలంలోని ఇప్పగూడేనికి చెందిన మోడెం వంశీ కొంతకాలంగా భద్రాచలంలో ఉంటూ సిటీ స్టైల్ జిమ్‌లో శిక్షణ తీసుకుంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించాడు. ఈక్రమంలో యూరప్ ఖండంలోని మాల్టా దేశంలో జరిగే పవర్ లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించాడు. మోడెం వంశీ తల్లిదండ్రులు మోహన్‌రావు, లక్ష్మి ఇంటి వద్దనే వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మాల్టా దేశం వెళ్లేందుకు పవర్ లిఫ్టింగ్ ఇండియా అసోసియేషన్‌కు రూ.2.10 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లగా ఐటీడీఏ పీవో బి.రాహుల్ దృష్టికి తీసుకెళ్లి వంశీ ఆర్థిక పరిస్థితి వివరించారు. దీంతో తక్షణమే స్పందించిన పీవో శుక్రవారం ఆయన కార్యాలయంలో రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు.

ఎంపీటీసీపై పోలీసులకు ఫిర్యాదు

లక్ష్మీదేవిపల్లి,జూలై18: ఎంపీటీసీగా ఉన్న ఓ ప్రజాప్రతినిధి మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన లక్ష్మీదేవిపల్లి మండలంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ నాలుగు రోజుల క్రితం తాను తీసుకున్న అప్పు చెల్లించేందుకు ఒకరి ఇంటి వద్దకు వెళ్లింది. అప్పటికే అక్కడున్న ఎంపీటీసీ తరాల రామ్మూర్తి ఆ మహిళను అనుసరించాడు. తనను లైంగిక వేధింపులకు దిగాడు. అక్కడి నుంచి తప్పించుకున్న మహిళ తన ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని భర్తకు వివరించింది. భర్త ఈ విషయాన్ని లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు బాదితుల కథనం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జ్వరంతో జవాన్ మృతి


బాలాజీ (ఫైల్)

కారేపల్లి జూలై19: మండలం పరిధిలోని బాగ్యనగర్‌తండాకు చెందిన తేజావత్ బాలాజీ (39)అనే వ్యక్తి 2007 నుంచి ఇండో టిబెటియన్ బెటాలియన్ పోలీస్ (ఐటీబీపీ)లో జావాన్‌గా పనిచేస్తున్నాడు. తీవ్ర జ్వరంతో శుక్రవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెం దాడు. 17ఏళ్లుగా ఐటీబీపీలో విధులు నిర్వర్తిస్తు న్నారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. పదిరోజుల క్రితం జ్వరం వస్తుందని సంబందిత అధికారు లకు సమాచారం అందించడంతో స్పందించిన సంబందిత ఆర్మీ అధికారులు బాలాజీని వెంటనే భాగ్యనగర్‌తండాకు పంపిచారు. ఇల్లెందు, ఖమ్మంలో చికిత్స పొందినా తగ్గక పోవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో ఆసుపత్రికి తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతదేహన్ని హైదరాబా ద్‌నుంచి భాగ్యనగర్‌కు తీసుక వస్తున్నట్లు కుటుంబసభ్యులు తలెపారు. మృతుడు బాలా జీకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. శనివారం భాగ్యనగర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

ఏన్కూరులో రెండు డెంగీ కేసులు నమోదు

ఏన్కూరు, జూలై19: మండల పరిధిలోని రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. ఏన్కూరు, రాజలింగాల గ్రామాల్లో ఒక్కోకేసు నమోదయింది. శుక్రవారం గ్రామ పంచాయతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామాల్లో స్ప్రే చేయించారు. టైర్లలో, తొట్లలో నిలవ నీటిని తొలిగించారు. మురికి గుంటల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. పీహెచ్‌సీ వైద్యులు రాములు ఆరోగ్య విషయాలపై అవగాహన కలిగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు ఈకార్యక్రమంలో సీహెచ్‌వో శివరాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు జయమ్మ, భారతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన మహిళల స్వయం అభివృద్ధికి

రూ. 2.80కోట్ల కేటాయింపు

- భద్రాచలం, పినపాక ఎమ్మెల్యే తెల్లం, పాయం
- గిరిజన హస్త కళ, అటవీ ఉత్పతుత్తల ప్రదర్శన మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే


గిరిజన హస్తకళ,అటవీ ఉత్పత్తుల ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యేలు

భద్రాచలం, జూలై 19: ఆదివాసీ గిరిజన మహిళలు స్వశక్తితో జీవనోపాధి పెంపొందించుకోవ డానికి వవిధ రకాల అటవీ ఉత్పతులతోపాటు చేనేత ఉత్పత్తులు, పౌష్టికాహారమైన ఆహారపదార్థాలు తయారీతో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ట్రైబల్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ట్రైఫేడ్) సంస్థ రూ. 2.80 కోట్లు కేయించిందని భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావ్, పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం భద్రాచలంలోని గిరిజన భవన్‌లో రీజనల్ మేనేజర్ ట్రైఫేడ్ ఏపీ, తెలంగాణ, ఐటీడీఏల సంయుక్త ఆధ్వర్యంలో గిరిజన హస్తకళల ఉత్పత్తులు, అటవీ ఉత్పత్తులు, చేనేత ఉత్పత్తి ప్రదర్శన మేళాను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 6000 గిరిజనుల కుటుంబాల్లోని ఆదివాసీ, గిరిజనమహిళలకు ఈనిధులు కేటాయించినట్లు వారు పేర్కొన్నారు. దళారీల బారిన పడి మోసపోకుండ ట్రైబల్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ట్రైఫేడ్) సంస్థ ద్వారా వాటి మన్నికను గుర్తించి వారికి సరైనధర నిర్ణయించి వారు ఆర్థికంగా అభివృద్ధిచెందే విధంగా కృషి చేయడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. ఆదివాసీ, గిరిజన మహిళలు ఇంటి పట్టునే ఖాళీగా ఉండకుండ కొంతమంది మహిళలు సొసైటీగా ఏర్పడి గిరిజనులకు, ప్రజలకు ఉపయోగపడే వివిధరకాల వస్తువులను సొంతంగా తయారు చేసి అమ్మకాలు జరుపుకుని జీవనోపాధి పెంపొందించుకోవచ్చని వారు అన్నారు. వారి కుటుంబాలను పోషించుకోడమే కాక పదిమందికి ఉపాధి కల్పిస్తారని, ట్రైఫేడ్ సంస్థ వారు ఆ వస్తువులను గుర్తించి ఇతర రాష్ట్రాల్లో కూడా వారికి ప్రదర్శన రూపంలో అవకాశం కల్పించి జీవనోపాధి పొందేలాచూడాలని వారు పేర్కొన్నారు. అనంతరం ట్రైఫేడ్ సంస్థ రీజనల్ మేనేజరు శ్రీనివాస్ సంకె మాట్లాడుతూ ఆదివాసి గిరిజన మహిళలకు చేయూతను అందించి వారికి వివిధ చేనేత అటవీ ఉత్పత్తులు ఇతర ఉత్పత్తుల్లో శిక్షణ ఇచ్చి వారి జీవనోపాధి కి కృషి చేస్తామని అన్నారు. గిరిజన భవనంలో ఏర్పాటుచేసిన స్టాళ్లను ఐటీడీఏ పీవో వీ రాహుల్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులు అధికంగా బలోపేతం కావడానికి సహకరించాలని ట్రైఫేడ్ అధికారులను కోరారు. గిరిజనులు తయారుచేసే వస్తువులకు మార్కెట్లో మంచి ధర వచ్చేలా వారు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ఎస్‌ఈఓ సురేష్‌బాబు, జీసీసీ డీఎం దావీద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీలో మాట మార్చిన కాంగ్రెస్: బీజేపీ


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి

ఖమ్మం బైపాస్‌రోడ్డు, జూలై19: షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేస్తామని హమీ ఇచ్చి కాంగ్రెస్ ఇప్పుడు మాట మార్చిందని బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జ్, మాజీ ఏమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ఖమ్మంనగరంలోని ఓ ప్రవేటు హోటల్ లో శుక్రవారం పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంను నిర్వహించారు. పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఇప్పటి వరకు అమలు చేయలేదని అన్నారు. వెంటనే ఇచ్చిన హమీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు మార్తనేని దర్మారావు, రాష్ట్ర కిసాన్‌మోర్చా అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, ఆవనికాంత్ పాండేజీ, జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారయణ, తాండ్ర వినోదరావు, వాసుదేవరావు, సన్నె ఉదయ్ ప్రతాప్, నున్నా రవి, రమేష్, శ్యామ్ రాథోడ్, అరుణ, అనిత, విజయరెడ్డి, చావా కిరణ్ పాల్గొన్నారు.

'సీతారామ'కు పూర్తిస్థాయితో నిధులు కేటాయించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

కామేపల్లి, జూలై 19: సీతారామ ప్రాజెక్ట్‌కు పూర్తి స్థా యిలో నిధులు కేటాయించా లని సీపీఎం జిల్లా కార్యదర్శి ను న్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కామేపల్లి మండల కేంద్రంలో వింజం నాగభూషణం అధ్యక్షతన ప్లీనరి సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గారడి మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీతారామా ప్రాజెక్ట్ కాలువ ఏన్కూర్ వరకు వచ్చిన కొంతమంది మంత్రులు స్వార్థ ప్రయోజనల కోసం దారి మళ్లింపు కార్యక్రమం చేపట్టారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హమీలు నేరవేర్చాలని అన్నారు. ఈకార్యక్రమంలో దుగ్గి క్రిష్ణ, మండల కార్యదర్శి అంబటి శ్రీనివాసరెడ్డి, బాదావత్ శ్రీను, కిన్నెర రామచంద్రయ్య, ఆరెం లక్ష్మి, అడప ఉపేందర్, వెంకటరెడ్డి, రామారావు, రమేష్, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

- టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల


రమేష్‌ను సన్మానిస్తున్న యూనియన నాయకులు

పాల్వంచ, జూలై 19: వివిధ విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూనే ఉంటానని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్ అన్నారు. పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం చారుగుండ్ల రమేష్‌కు సన్మాన కార్యక్రమాన్ని యూనియన్ నాయకులు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి దక్కడంతో పాటు పుట్టినరోజును పురస్కరించుకుని యూనియన్ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో పని చేస్తున్న నాయకులు, స్థానిక నాయకులు సన్మాన కార్యక్రమానికి భారీగా హాజరయ్యారు. ముందుగా రమేష్‌ను సత్కరించారు. అతను కార్మిక లోకానికి చేస్తున్న సేవలను కొనియాడారు. చారుగుండ్ల మాట్లాడుతూ తనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి రావడానికి తన కృషి మాత్రమే కాదని, యూనియన్ నాయకులు, సభ్యులు, కార్మికుల సహకారం ఎంతగానో ఉందన్నారు. భవిష్యత్తులోనూ అందరి తోడ్పాటుతో ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు సాగుతాని, కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కారం కావడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కేటీపీఎస్ 5,6 దశలు, 7వ దశ రీజియన్ నాయకులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన టీఆర్‌వీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కావు

- రాయల చంద్రశేఖర్ 50ఏళ్ల ఉద్యమ చరిత్ర
- 28న ఖమ్మంలో సంస్మరణ సభ
- మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 19: ప్రజా సమస్యలైనా, వ్యక్తిగత, కుటుంబ సమస్యలైనా వాటి ని ఎదుర్కొని ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని, మనుషులపై సమస్యలది పై చేయి కాకూడద ని, ఆత్మహత్యలు ఏ సమస్యకు పరిష్కారం కాదని, కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ మరణంపై సీపీఐ(ఎంఎల్), రాష్ట్ర, కేంద్ర కమిటీలు దిగ్భంతిని వ్యక్తం చేశాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జాతీయ సహాయ కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50ఏళ్ల పాటు విప్లవోద్యమంలో అనేక పోరాటాలు చేసిన చంద్రశేఖర్ మరణం పార్టీకి తీరని లోటుగా పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సంతాప వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ప్రకటించారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 28న ఖమ్మంలో సంస్మరణ సభను ఏర్పాటు చేశామని, ఇందులో కేంద్ర కమిటీ నాయకత్వం పాల్గొంటుందన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఇప్పటికే తహసీల్దార్, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలపై పార్టీ రాష్ట్ర వ్యాప్త ఉద్యమ కార్యచరణ ప్రకటించిందని, రాయల చంద్రశేఖర్ సంతాప వారోత్సవాల సందర్భంగా ఉద్యమ కార్యచరణను ఆగస్టు నెలకు పొడిగించటం జరిగిందన్నారు. జిల్లా కమిటీ కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెద్దవాగు ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు చేయకపోవటంతో ఇప్పుడు ప్రమాదం జరిగిందన్నారు. ప్రాజెక్టు తెలంగాణాలో ఉండటం, ఆయకట్టు ఏపీలో ఉండటంతో ఎవ్వరు పట్టించుకోకపోవటంతో ఇప్పుడు 30గ్రామాల ప్రజలు మనుకకు గురైనారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్వాహణను పట్టించుకోవాలని కోరారు. నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల అశోక్, ఆవుల వెంకటేశ్వర్లు, ఝాన్సీ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కరకగూడెం, జూలై 19: మండలంలోని తాటిగూడెం పంచాయతీ నేతకానీ గుంపు గ్రామానికి చెందిన దుర్గం దుర్గ(45) అనే మహిళా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కరకగూడెం మండలంలో శుక్రవారం జరిగింది. కరకగూడెం ఎస్‌ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నేతకాని గుంపు గ్రామానికి చెందిన దుర్గం సంజీవ భార్య దుర్గ అనే మహిళ కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతోంది. శుక్రవారం తెల్లవారున ఉరి వేసుకుని మృతి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు తండ్రి కొండగొర్ల దొడ్డయ్య ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి శవ పరీక్ష అనంతరం కుటంబ సభ్యులకు అప్పగించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

ఆర్టీసీ సేవలపై ఎండీకి ట్విట్టర్‌లో ఫిర్యాదు

మణుగూరు, జూలై 19: మణుగూరు నుంచి భద్రాచలం ప్రాంతానికి ఉదయం సమయం లో ఉన్న బస్సు సర్వీసు సరైన సమయ పాలన పాటించడం లేదని పేర్కొంటూ ఆర్టీసీ ఎండీకి శుక్రవారం ఫిర్యాదులు అందా యి. ఉదయం 8 గంటల సర్వీసు సకాలంలో రాకపోయే సరికి తాము అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, పలువురు ప్రయాణికులు సంస్థ ఛైర్మన్ సజ్జనార్‌కు ఫిర్యాదులు చేశారు. స్థానిక యువకులు కొందరు ట్విట్టర్‌లో కూడా ఈ అంశంపై ఫిర్యాదు చేశారు. స్థానిక అధికారుల సూచనలు పాటించకుండా.. ఒకరిద్దరి మాటలనే వింటూ కొందరు డ్రైవర్లు, కండక్టర్లు విధులకు హాజరైయ్యే క్రమంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపనలు మణుగూరు డిపోలో వినిపిస్తున్నాయి. ఈ విషయంపై డిపో అధికారులు విధుల విషయాల్లో నిర్దిష్టమైన చర్యలనుతీసుకుని ప్రయాణికులకు మంచి సర్వీసు అందివ్వాలని ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.

చెరువులకు జలకళ

- ఉమ్మడి ఖమ్మం జిల్లాను వదలని వర్షం
- చెరువులు, ప్రాజెక్టులకు చేరుతున్న వరదనీరు
- నిండుకుండలా బేతుపల్లి, లంకాసాగర్ ప్రాజెక్టులు
- పోలీసుశాఖ అప్రమత్తం.. కంట్రోల్‌రూం ఏర్పాటు


అలుగుపోస్తున్న బేతుపల్లి చెరువు

ఖమ్మం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో పడుతున్న వర్షం మూడోరోజు ముసురుగానే కొనసాగింది. తెరపివ్వకుండా పడుతున్న జల్లులతో వాతావరణం హర్షాతిరేకమైంది. గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆగకుండా పడుతున్న జల్లులతో పలు చెరువులు, చిన్న, మధ్యతరగతి ప్రాజెక్టులకు వరదనీరు చేరి జలకళను సంతరించుకుంటున్నాయి. కాగా జిల్లాలో జూలై నెలకు సంబంధించి సాధారణానికి మించి 40శాతం వర్షపాతం నమోదైంది. వాస్తవానికి 26.67 సెంమీ వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటివరకు 37.28సెంమీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని బేతుపల్లి, లంకాసాగర్ ప్రాజెక్టులు నిండిపోయాయి. కాగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు నమోదైన వర్షపాతం పరిశీలిస్తే రాష్ట్రంలో ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం లింగాలలో అత్యధిక వర్షపాతం నమోదైంది.

నమోదైన వర్షపాతం ఇలా..

ఖమ్మం జిల్లాలోని కామేపల్లి మండలం లింగాలలో 4.28 సెం.మీ, కారేపల్లిలో 4.05, వేంసూరులో 3.6, కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో 3.5, రఘునాథపాలెం మండలం పంగిడిలో 3.33, ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో 2.93, తల్లాడలో 2.85, తిరుమలాయపాలెంలో 2.6, ముదిగొండలో 2.45, చింతకానిలో 2.38, ఎన్కూరులో 2.30, రఘునాథపాలెం మండలం మంచుకొండలో 2.25, ఖమ్మం నగరంలోని ప్రకాష్‌నగర్‌లో 2.18, పెనుబల్లి, వైరాలలో 2.15, తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో 2.08, కొణిజర్ల మండలం పెద్ద గోపతిలో 1.83, పెనుబల్లి మండలం గౌరారంలో 1.75, రఘునాథపాలెం మండల కేంద్రంలో 1.73 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని కూసుమంచి, సత్తుపల్లి, సదాశివునిపాలెం, ఏన్కూరు తిమ్మారావుపేట, కొణిజర్ల, మధిరలలో ఒక సెం.మీ వర్షపాతం నమోదుకాగా మిగిలిన ప్రాంతాల్లో ఒక సెం.మీ లోపే వర్షపాతం నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు, ఇల్లెందులో 1.73 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఆ రెండు మండలాలతోపాటుగా దమ్మపేట మండలం అంకంపాలెం, పాతకొత్తగూడెంలలో 1.5సెం.మీ, దమ్మపేట మండలం మండాలపల్లిలో 1.43, పాల్వంచ సీతారామపట్నంలో 1.35, చంద్రుగొండ మండలం మద్దుకూరులో 1.33, అశ్వారావుపేటలో 1.18, లక్ష్మీదేవిపల్లిలో 1.13, దమ్మపేట మండలం మల్కారంలో 1 సెం.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో ఒక సెం.మీలోపే వర్షపాతం నమోదైంది.

నిండుకుండలా బేతుపల్లి, లంకాసాగర్

వరదనీరు వస్తుండడంతో ప్రాజెక్టులకు స్వల్పంగా నీరు చేరుతోంది. జిల్లాలోని చిన్న, మధ్యతరగతి ప్రాజెక్టులకు వరదనీరు చేరుతుండగా.. కొన్ని ప్రాజెక్టులు నిండి ప్రవహిస్తున్నాయి. సత్తుపల్లి డివిజన్‌లోని బేతుపల్లి ప్రాజెక్టుకు 16 అడుగుల సామర్థ్యానికి గాను 17 అడుగుల మేర నిండి ప్రవహిస్తోంది. లంకాసాగర్ మీడియం ప్రాజెక్టు 16అడుగులకుగాను 15.2 అడుగులకు చేరి అలుగు పారుతోంది. మధిర జాలిమూడి ప్రాజెక్టుకు కూడా వరద నీరు ఉధృతంగా వచ్చి చేరుతోంది. 15 అడుగుల సామర్థ్యానికిగాను 15.24 అడుగుల వచ్చి చేరుతోంది. పాలేరు రిజర్వాయర్‌లో 23 అడుగులకు గాను 5.9 అడుగులకు నీళ్లు చేరాయి. వైరా ప్రాజెక్టుకు 18.03 అడుగులకు గాను 8.3 అడుగుల మేర నీళ్లు చేరాయి. జిల్లాలో పలు చెరువులు పూర్తిగా నిండిపోయాయి. జిల్లాలోని 984 చెరువులకు గాను 143 చెరువులు పూర్తిగా నిండగా, 251 చెరువులు సగానికి పైగా నిండాయి. 96 చెరువులు 25 నుంచి 50శాతం, 470 చెరువులు 25 శాతం నిండాయి. కాగా నాగార్జున సాగర్‌కు వరద నీరు వచ్చి చేరుతున్న నేపథ్యంలో ఖమ్మం జిల్లాకు సాగర్ జలాలను గురువారం విడుదల చేశారు. ప్రాజెక్టు వద్ద 3వేల క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. అవి శుక్రవారం మధ్యాహ్నానికి పాలేరుకు చేరుకునే అవకాశం ఉంది.

పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు

వర్షాలు, వరదల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీచేస్తూ ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఓ ప్రకటన విడుదల చేశారు. చెరువులు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో పిల్లలు ఇళ్లల్లో నుంచి బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసర సమయాల్లో సహకారం అందించేందుకు 87126 59111 నెంబరుతో పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. స్థానిక పోలీసులు తమ పరిధిలోని జలమయం అయ్యే ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జలమయమయ్యే ప్రాంతాలు ఉన్నచోట రోడ్డు, రవాణా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందిపడకుండా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.

తాగునీటికోసం సాగర్ జలాలు విడుదల

- ఇరిగేషన్ సెక్రటరి ప్రశాంత్‌జీవన్‌తో మాట్లాడిన మంత్రి తుమ్మల

ఖమ్మం, జూలై19(ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో తాగునీటిఅవసరాల కోసం సాగర్ జలాలు విడుదల చేయాలని నీటిపారుదల శాఖ ప్రశాంత్‌జీవన్ పాటిల్‌తో పాటు ఎన్నెస్పీ అధికారులతో శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సూచించడంతో సాగర్‌ఎడమకా లవకు నీటి విడుదల చేశారు. శనివారం పాలేరు రిజర్వాయర్‌కు నీరు చేరనుంది. దీనిని మిషన్ భగీరథ ద్వారా పాలేరు నియోజకవర్గంతోపాటు ఖమ్మం నియోజకవర్గానికి తాగునీటి ఎద్దడి లేకుండా సరఫరాచేయాలని మంత్రి అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
శనివారం 20 జూలై 2024



'అత్యవసరంలో ఫోన్ చేయండి'

మణుగూరుటౌన్, జూలై 19: మణుగూరుతోపాటు సబ్ డివిజన్ ప్రజలు వచ్చే వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ రాఘవరెడ్డి సూచించారు. శుక్రవారం డీఎస్పీ రవీందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. వరదల కారణంగా అనుకోని సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే 100కు డయల్ చేయాలని, లేదా స్థానిక పోలీస్‌స్టేషన్లకు సమాచారమివ్వాలన్నారు. గోదావరి నది పెరుగుతున్న నేపథ్యంలో నది సమీప గ్రామాల ప్రజలు నదివైపు వెళ్లవద్దని, పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దని సూచించారు. మణుగూరు మున్సిపాలిటీ, మండలంలోని పలు వరద ప్రాంతాలను, చెరువులను, వాగులను, గోదావరి నదీ పరివాహక ప్రాంతాలను శుక్రవారం తహసీల్దార్ రాఘవరెడ్డి సందర్శించారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి గోదావరి ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు గోదావరి నదిలోకి చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.

విద్యా, వైద్య రంగాలపై దృష్టి

కార్పొరేట్ సంస్థలకు ధీటుగా సర్కారు సంస్థలు

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తగూడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యరంగాల అభివృద్ధికి, సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం రామవరం 11వ వార్డు పరిధిలోని నేతాజీ ఉన్నత పాఠశాలలో రూ.13.50లక్షల వ్యయంతో నిర్మించనున్న సైన్స్ ల్యాబ్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేసి అనంతరం మాట్లాడారు. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంగా ఉన్న కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ విద్యాసంస్థలు సౌకర్యాలేమితో కొట్టు మిట్టాడుతున్నాయని, సౌకర్యాల కొరత, పురాతన భవనాలతో విద్యా సిబ్బంది, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, డ్రాప్ అవుట్ల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతుండటం వల్ల ప్రభుత్వ విద్యాసంస్థలు మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయని, ఈ పరిస్థితిలో విద్యాలయాలను కార్పోరేటుకు ధీటుగా తీర్చిదిద్ది ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే లక్ష్యంతో సంబంధిత ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుంచి నిధులు సమకూర్చేందుకు అదేవిధంగా ప్రభుత్వ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

వైద్యశాలలను సైతం అదేస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. సౌకర్యాల కల్పనలో దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఎస్‌కే. సాబీర్‌పాషా, చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్


సైన్స్ ల్యాబ్‌కు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

భూక్య శ్రీనివాస్, ఎంఈవో జుంకిలాల్, కమీషనర్ శేసాంజన్‌స్వామి, నోడల్ అధికారి ప్రభుదయాల్, అమ్మ ఆదర్శ కమిటి చైర్ పర్సన్ స్వప్న, హెచ్‌ఎం ద్రౌపతి, సీఐ రమేష్‌కుమార్, మున్సిపల్ డీఈ రవికుమార్, ఏఈ రాము, ఎడ్యూకేషన్ ఏఈ రాంకుమార్, విద్యుత్‌శాఖ ఏఈ నరేష్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు: ఎస్పీ రోహిత్ రాజు


పెదవాగు ప్రాజెక్టు వద్ద కలెక్టర్, ఎస్పీ

కొత్తగూడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రహదారులన్నీ జలమయయ్యాయి. వాహనదారులు ప్రయాణికులు చేసేటప్పుడు రోడ్లపై ఉన్న గుంతలు నీటితో నిండి ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, అవసరమైతే తప్ప బయటకి రావొద్దని ఎస్పీ రోహిత్‌రాజ్ కోరారు. రాబోయే రెండురోజుల్లో కూడా భారీ వర్షాలు ఉన్నట్లు ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసింది. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని వాగులు, వంకలు, చెరువులు, నదులుపొంగి ప్రవహిస్తున్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఇతరశాఖలతో సమన్వయం పాటిస్తూ పోలీస్ యంత్రాంగం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న నదులను పొంగి పొర్లుతున్న చెరువులను, వాగులను చూడటానికి బయటకు వచ్చి ప్రమాదాల బారిన పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఆపదలో ఉన్నవారు డయల్ 100కు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. అశ్వారావుపేట నారాయణపురం వద్ద పెద్దవాగు ప్రాజెక్టులో భారీగా వరద నీరు చేరి ఒక్కసారిగా ఉధృతి పెరగడంతో అక్కడ వ్యవసాయ పనుల కోసం వెళ్లిన కూలీలు వరదనీటిలో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అనంతరం కలెక్టర్, పీవో, అశ్వారావుపేట ఎమ్మెల్యే, ఇతర అధికారులతో కలిసి పెద్దవాగు ప్రాజెక్టును పరిశీలించారు.

పాఠశాలలను సందర్శించిన డీఈవో

బూర్గంపాడు, జూలై 19: బూర్గంపాడు మండల పరిధిలోని బూర్గంపాడు కేజీబీవీ, ఎంపీపీఎస్ గౌతపురం, జడ్పీహెచ్ఎస్ సారపాక, ఎంపీపీఎస్ తాళ్లగొమ్మూరు పాఠశాలలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆదికారి ఎం.వెంకటేశ్వరచారి సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పర్యవేక్షించారు. విద్యార్థులకు సంబంధించి ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌ను పూర్తి స్థాయిలో ప్రధానోపాధ్యాయులు ప్రతి రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఫిజియోథెరపి కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో దివ్యాంగులకు అందుతున్న సౌకర్యాల గురించి తల్లితండ్రులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వాళ్ల ప్రగతిని పరిశీలించారు.

భారీ వర్షాలకు బయటకు రావొద్దు..


వాగు ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందు టౌన్, జూలై 18: భారీ వర్షాల కారణంగా అత్యవసరమైతేనే ప్రజలు బయటకు రావాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను హెచ్చరించారు. శుక్రవారం వర్షాల మూలంగా ఉధృతంగా ప్రవహిస్తున్న ఇల్లెందు పరిసర ప్రాంతాల్లో ఉన్న వాగులను పరిశీలించారు. ఇల్లెందు పట్టణంలో వర్షంపై హెచ్చరికలు జారీ చేస్తూ ఆటో ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండురోజులపాటు భారీ వర్షాలు ఉన్నందున అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంట్లో నుంచి బయటకు రావాలని లేదంటే ఇంట్లోనే ఉండేవిధంగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పశువుల కాపర్లు సుదూర ప్రాంతాలకు వెళ్లవద్ద, వాగులు, వంకలు దాటవద్దని హెచ్చరించారు.

పక్కా రహదారుల నిర్మాణానికి కృషి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

లక్ష్మీదేవిపల్లి, జూలై 19: మారుమూల గ్రామాలకు సైతం రహదారి సౌకర్యం కల్పించి గ్రామీణులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నామని కొద్దిరోజుల్లోనే రహదారుల సమస్యలేని గ్రామాలు ఆవిష్కృతం అవుతాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోనిరేగళ్ల గ్రామ శివారులో రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హైలెవల్ వంతెన నిర్మాణం, లోతువాగు మాదిగప్రోలు గ్రామాల మధ్య రూ.12.00లక్షల వ్యయంతో నిర్మించనున్న చప్టా నిర్మాణానికి రూ.25లక్షల వ్యయంతో నిర్మించనున్న పెద్దతండా, మన్యతండా కాజ్‌వే నిర్మాణానికి అదే విధంగా హేమచంద్రపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ. 13. 50లక్షల వ్యయంతో నిర్మించనున్న సైన్స్‌ల్యాబ్ భవనానికి శుక్రవారం కూనంనేని శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతక్రమంలో మౌళిక వసతులు, అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇప్పటికే ఎస్ఆర్ఈజీఎస్, డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్ పథకాలు, వివిధ గ్రాంట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని త్వరలోనే గెలుపు ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధే ధ్యేయంగా


గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

తాను పనిచేస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా, పీఏసీఎస్ డైరెక్టర్, సీపీఐ మండల కార్యదర్శిచంద్రగిరి శ్రీనివాస రావు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ఎం.వసంత, ధర్మారాజు, ఎవో మోహన్, డీఈ రామకృష్ణ, ఈఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో చలపతిరావు, తహసీల్దార్ కేఆర్‌కే.ప్రసాద్, ఎంఈవో జుంకీలాల్, ఏఈ రఘురాం, హెచ్‌ఎం శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే


ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

దమ్మపేట, జూలై 19: రెండురోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు దమ్మపేట, మందలపల్లి గ్రామాలలో పలు కాలనీలు నీట మునిగాయి. వీటిని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆయిల్‌ఫాం అడ్వైజరీకమిటి సభ్యుడు ఆలపాటి రాంచంద్రప్రసాదుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఇటీవలే మందలపల్లి బస్టాండు చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం ఆర్టీసీ అధికారుల చేపట్టారు. దీంతో ఎగువ ప్రాంతం నుండి వచ్చే నీరు బయటకు నీరు వెళ్లే అవకాశం లేక పోవటంతో బస్టాండు వెనుకప్రాంతం పూర్తిగా నివాసాలు నీట మునిగాయి. సైడ్ డ్రైయిన్లు లేక పోవటంతో మందలపల్లి క్రాస్‌రోడ్ మొత్తం వరదనీటితో ముంపుకు కావటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో గ్రామస్థులు తాత్కాలికంగా ఆర్టీసి ప్రహరీకి రంధ్రం ఏర్పాటు చేయటంతో తాత్కాలికంగా నీటి ముంపు తప్పింది. ఈ ప్రాంతాన్నీ ఎమ్మెల్యే పరిశీలించి నీరు నిల్వకుండా డ్రైయిన్ ఏర్పాటు చేయాలనీ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారికి డ్రైయిన్ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలో వరద నీటికి గురై దెబ్బతిన్న పలు రోడ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. వరద వల్ల దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎర్ర ప్రసాదు, గ్రామస్థులు ఉన్నారు.

స్లూయిస్‌ల వద్ద రక్షణ చర్యలు


రక్షణగా అమర్చిన ఇసుక బస్తాలు

దుమ్ముగూడెం, జూలై 19: దుమ్ముగూడెం వద్ద ఇరిగేషన్ అధికారులు శుక్రవారం గోదావరి వరదముంపు రక్షణ చర్యలను చేపట్టారు. దుమ్ముగూడెం గ్రామంలోకి వరద నీరు రాకుండా కరకట్ట ఔట్ స్లూయిస్‌ల వద్ద ఇసుక బస్తాలను ఏర్పాటు చేశారు. బలహీనంగా ఉన్న హెడ్‌లాకుల వద్ద కరకట్టపై రక్షణగా ఇప్పటికే ఇసుక బస్తాలను పేర్చారు. ఏఈ రాజ్‌సుహాస్, సిబ్బంది మస్తాన్ వలీ ఏర్పాట్లలో పాల్గొన్నారు.

లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పాల్వంచ సీఐ వినయ్‌కుమార్

పాల్వంచ, జూలై 19: కిన్నెరసాని నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ సూచించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నందున ముందస్తు చర్యల్లో భాగంగా పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి కిన్నెరసాని గ్రామంలోని లోతట్టు ప్రాంతాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు తగు సూచనలు చేశారు. కిన్నెరసాని డ్యాం సామర్థ్యానికి చేరువలోకి నీటిమట్టం చేరుకుందని, ఏ క్షణంలోనైనా డ్యాం అధికారులు గేట్లు ఎత్తే పరిస్థితి ఉందని, ఈ క్రమంలో ముఖ్యంగా కిన్నెరసాని గ్రామంలోని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇండ్లలోకి వరద నీరు చేరుకునే అవకాశం ఉందని, తమ విలువైన వస్తువులను భద్రపరచుకోవాలన్నారు. ప్రజలు అధికారులకు సహకరించాలని, అత్యవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రానికి వెళ్ళడానికి సంసిద్ధంగా ఉండాలని అన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ వినయ్ కుమార్

అనంతరం వరద పరిస్థితుల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఆయన వెంట పాల్వంచ రూరల్ ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టు ధ్వంసం

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్

అశ్వారావుపేట రూరల్, జూలై 19: పాలకుల నిర్లక్ష్యం వల్లే పెదవాగు ప్రాజెక్టు ధ్వసమైందని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ విమర్శించారు. గతమూడు రోజులుగా ఎడతెరపీ లేని వానలతో సామర్థ్యం మించి వరదతో ధ్వంసమైన ప్రాజెక్టును సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పల్లయ్య, నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆంధ్ర, తెలంగాణా రెండు రాష్ట్రాలలో ఉండటం వల్లే పాలకుల నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన జరిగిందన్నారు. రెండు రాష్ట్రాల పాలకులు నిధులు కేటాయించకపోవటం వల్లె గేట్లు మరమ్మతులకు గురయ్యాయని అందువల్లే ప్రాజెక్టుకు ప్రమాదం ఏర్పడిందన్నారు. రెండు రాష్ట్రాల సీఎంలు రాష్ట్రస్థాయి అధికారుల సమావేశం ఏర్పాటు చేసి ప్రాజెక్టును పునరుద్ధరించాలని ఇరుప్రభుత్వాలను


పెదవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

డిమాండ్ చేసారు. పూర్తిగా ఆదివాసీ ప్రాంతంలో వుండటం వల్లే వివక్షకు గురైందన్నారు. ప్రాజెక్టు వరద వల్ల నష్టపోయన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్ఐ రాణా ప్రతాప్

జూలూరుపాడు, జూలై 19: అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాణా ప్రతాప్ కోరారు. శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలసి మండలంలోని అన్నారపాడు, గుండ్లరేవు, బేతాళపాడు తదితర గ్రామాల్లోని వాగులను, చెరువుల ఉధృతితో పాటు లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతులు వాగులు, చెరువుల వైపు వెళ్లవద్దని కోరారు. వరద ప్రభావం ఉన్న గ్రామాలలోని ప్రజలను ప్రజాప్రతినిధులు అప్రమత్తం చేయాలని కోరారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దని తెలిపారు. వరద సహాయ చర్యలకై పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయాలు వసతి గృహాలు

జూలూరుపాడు, జూలై 19: పాలకుల విధానాలతో సంక్షేమ వసతి గృహాలలో సమస్యలు విలయతాండవం చేస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అన్నారు. శుక్రవారం జూలూరుపాడులో జరిగిన ఆ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్న విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవటం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహల్లో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి అదికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసరావు, సాయి, అనిల్‌కుమార్, చరణ్‌తేజ పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఆర్డీవో

బూర్గంపాడు, జూలై 19: బూర్గంపాడు శివారులోని లోతట్టు ప్రాంతాలను శుక్రవారం భద్రాచలం ఆర్డీవో దామోదర్ పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ వర్షా కాలం దృష్ట్యా గోదావరి, కిన్నెరసాని నదుల పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం తెలంగాణ-ఏపీ సరిహద్దు కిన్నెరసాని బ్రిడ్జిని పరిశీలించారు. గోదావరి వరద పెరిగే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ముత్తయ్య, మండల సర్వేయర్ వెంకట్ పాల్గొన్నారు.

మహసభను జయప్రదం చేయండి

జూలూరుపాడు, జూలై 19: సేవాలాల్ సేన రాష్ట్ర మహసభ హైదరాబాద్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో వచ్చే నెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్ రాథోడ్‌లు తెలిపారు. శుక్రవారం జూలూరుపాడులో మహసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు అధిక సంఖ్యలో మహసభకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 10 శాతం గిరిజన రిజర్వేషన్ పెంపు జీవో 33 కు చట్టబద్దత కల్పించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని కోరారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు మంత్రి పదవిని కేటాయించి గిరిజనులకు సముచిత న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అప్రమత్తంగా ఉండండి: ఆర్డీవో

దుమ్ముగూడెం, జూలై 19: గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో దామోదరావు సూచించారు. వరదముంపు గ్రామం సున్నంబట్టిని శుక్రవారం సందర్శించారు. వరద సమస్యలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఏటా వరదముంపుతో తాము ఎదుర్కొంటున్న దుస్థితిను స్థానికుడు అర్జున్ ఆర్డీఓకు వివరించారు. గత ఏడాది వరదలకు తమ గ్రామం పూర్తిగా మునిగి 122 కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని వివరించాడు. తమకు మెరక ప్రాంతంలో ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిదులు, అధికారులు తర్వాత తమను అసలు పట్టించుకోలేదని తెలిపాడు. సీతమ్మ సాగర్ సర్వేలోనూ తమ గ్రామానికి అన్యాయం జరిగిందని వివరించాడు. ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్ పాల్గొన్నారు.

'మొక్కలతోనే మానవాళి మనుగడ'


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు టౌన్, జూలై 18: మొక్కలు నాటడం, పెంచడం ద్వారానే మానవాళికి మనుగడ ఉంటుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 25వ వనమహోత్సవాన్ని నిర్వహించారు. చెరువుకట్టపై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తుందని వెల్లడించారు. వనమహోత్సవం ద్వారా విరివిరిగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మేనేజరు అంకుషావళితోపాటు పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మితో ఆర్థిక చేయూత

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు టౌన్, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదవర్గాల మహిళలకు చేయూతను అందించేవిధంగా కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌ల ద్వారా ఆర్థిక సహాయం చేస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇల్లెందు వైసీవోఏ క్లబ్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ల ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను164మంది లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవర్గాల ఆడపిల్లలకు పెళ్లిళ్ల చేసేందుకు ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్నారని వారిని ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని వెల్లడించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సహాయాన్ని కుటుంబ అవసరాలతోపాటు


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇతర అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. ఈ రెండు పథకాలు పేదలకు భరోసానిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కోట రవికుమార్, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

పాల్వంచ రూరల్, జూలై 18: ఏజెన్సీ ప్రాంత ప్రజలకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఉల్వనూరు పీహెచ్‌సీ సెంటరును ఆయన సందర్శించారు. సమీపంలోని గిరిజన గ్రామాల్లో పర్యటించారు. చిరుతానుపాడు ఆదివాసీల ఆరోగ్య పరిస్థితులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సీజన్‌లో ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా వైద్యులు స్థానికంగా ఉంటూ వైద్య చికిత్సలు చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఆయన సూచించారు. వాటిపై వారికి అవగాహన కల్పించాలని కోరారు. ఆయన వెంట ఉల్వనూరు వైద్యురాలు డాక్టర్ తేజశ్రీ, మలేరియా సూపర్ వైజర్లు రామిరెడ్డి, సురేష్, హెల్త్‌సూపర్‌వైజర్లు ఉన్నారు.